28న ఎస్‌సి సంక్షేమ అసెంబ్లీ కమిటీ రాక

ప్రజాశక్తి-విజయనగరం

షెడ్యూల్డ్ కులాల సంక్షేమంపై ఏర్పాటైన రాష్ట్ర శాసనసభ కమిటీ నవంబర్ 28,29,30 తేదీల్లో జిల్లాలో పర్యటించనుంది. కమిటీ ఈనెల 28న రాత్రి విజయనగరం చేరుకుంటుంది. 29న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల రోస్టర్ రిజిస్టర్‌లు తనిఖీ చేస్తుంది. 30న ఉదయం 10 గంటల నుంచి జిల్లా కలెక్టర్, ఇతర జిల్లా అధికారులతో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్‌సిలకు రిజర్వేషన్‌ల అమలు, షెడ్యూల్డ్ కులాల వారికి సంక్షేమ పథకాల అమలుపై కలెక్టర్ కార్యాలయంలో సమీక్షిస్తారు. 30న రాత్రి 7.30 గంటలకు విజయవాడ బయలుదేరి వెళ్లనున్నారు.

రూ.1123కోట్లతో ఇంటింటికీ తాగునీరు

- గోనె సంచులు, ధాన్యం ట్రాన్స్‌పోర్టుపై ప్రత్యేక దృష్టి
- ఉపాధి హామీ ద్వారా పూడికతీత
- సామూహిక గృహప్రవేశాలకు ముందే విద్యుత్ సదుపాయం
- వేపాడ మండల కేంద్రానికి బస్సు సౌకర్యం
- జెడ్‌పి సమావేశంలో పలు సమస్యలపై చర్చ

సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ; వేదికపై జెడ్‌పి చైర్మన్, జిల్లా కలెక్టర్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో రూ.1123కోట్లతో ఇంటింటికీ తాగునీటి సదుపాయం కల్పిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. గోనె సంచులు, ధాన్యం ట్రాన్స్‌పోర్టుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పరిషత్ సభ్యులు, పలువురు ఎమ్మెల్యేలు కోరారు. ఉపాధి నిధులతో సాగునీటి కాలువల్లో పూడిక తీసే పనుల ప్రతిపాదనలు, ముందుగా ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని మంత్రి సూచించారు. సామూహిక గృహప్రవేశాల నాటికి ముందే ఇళ్లకు విద్యుత్ సదుపాయం కల్పించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. శాఖపరమైన పనులు ఎన్ని చేసినా గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కార బాధ్యత సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లదేనని స్పష్టం చేశారు.

చైర్మన్ శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వ సభ్యసమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం, ధాన్యం కొనుగోలు, గృహ నిర్మాణం, విద్యుత్, గ్రామీణ ఉపాధిహామీ, వైద్యారోగ్యం తదితర అంశాలపై చర్చించారు. ముందుగా జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా సుమారు రూ.1123 కోట్ల వ్యయంతో ఉమ్మడి జిల్లాలో మొత్తం 5,15,337 ఇళ్లకు సురక్షిత తాగునీటిని అందించే కృషి జరుగుతోందన్నారు. మంత్రి బొత్స మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకాన్ని అంకితభావంతో త్వరగా పూర్తి చేయాలన్నారు. దీనికోసం ప్రత్యేకంగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలను నిర్వహించాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీల్లోని ఇళ్లకు కూడా కుళాయిలు వేస్తామని తెలిపారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

ఈఏడాది ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా చేపడుతున్నట్లు మంత్రి బొత్స, జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు చెప్పారు. దళారులు, మిల్లర్ల ప్రమేయాన్ని పూర్తిగా నిరోధించే చర్యలను తీసుకున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 4.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో గోనె సంచులకు కొరత, ట్రాన్స్‌పోర్టు సమస్య ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయని, దీన్ని అధిగమించేందుకు సమగ్రమైన ప్రణాళికతో ముందుకు సాగాలని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన్నఅప్పలనాయుడు సహా పలువురు సభ్యులు కోరారు. జిల్లాలో డిసెంబరు 21న సామూహిక గృహప్రవేశాలు జరుగుతాయని, ఈలోపే ప్రతి ఇంటికీ విద్యుత్ సదుపాయం కల్పించే బాధ్యత ఎపిఇపిడిసిఎల్ అధికారులు చూసేకోవాలని మంత్రి బొత్స ఆదేశించారు. సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లు స్థానికంగా ఉండడం లేదని, సకాలంలో స్పందించక పోవడం వల్ల విద్యుత్ అంతరాయం తప్పడం లేదని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. ఎనర్జీ అసిసెంట్లు జాబ్‌చార్టుకు అనుగుణంగా పని చేయాల్సిందేనని, అలా పని చేయని వారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటారని అన్నారు. ఉపాధిహామీ ద్వారా సాగునీటి కాలువల్లో పూడిక తీతకు ప్రతిపాదనలు రూపొందించామని డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి వివరించారు. దీనిపై మంత్రి బొత్స స్పందిస్తూ పూడికతీత ప్రతిపాదలను ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లాలని, అనంతరం వారి సూచనల మేరకు చేర్పులు, మార్పులు చేసి పనులు మొదలుపెట్టాలని సూచించారు. జెడ్‌పి ఛైర్మన్ మాట్లాడుతూ పనిభారాన్ని తగ్గించేందుకు, టెక్నికల్ అసిస్టెంట్లను రేషనలైజ్ చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రీన్ అంబాసిడర్లకు 15వ ఆర్థిక సంఘం నిధులనుంచే జీతాలను చెల్లించాలని మంత్రి స్పష్టం చేశారు. పార్వతీపురంలో కేంద్ర గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడానికి తగిన స్థలాన్ని చూడాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్, ఎమ్మెల్సీలు డాక్టర్ పి.సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు, పాకలపాటి రఘువర్మ, కురుపాం, గజపతినగరం, ఎస్‌కోట, పార్వతీపురం, బొబ్బిలి ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, అప్పలనర్సయ్య, శ్రీనివాసరావు, జోగారావు, శంబంగి చినప్పలనాయుడు, జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జెడ్‌పి సిఇఒ ఎం.అశోక్‌కుమార్, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, జెడ్‌పి డిప్యూటీ ఛైర్మన్లు, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వేపాడకు బస్సు సౌకర్యం

వేపాడ మండల కేంద్రానికి బస్సు సౌకర్యాన్ని కల్పించాలన్న సభ్యుల విజ్ఞప్తి మేరకు మంత్రి వెంటనే స్పందించారు. వెంటనే సమస్య పరిష్కరించాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు.

సుందరపేటలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి

సుందరపేట సిహెచ్‌సిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని భోగాపురం జెడ్‌పిటిసి పడాల మంజులత కోరారు. జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల దృష్టా అవసరమని అన్నారు. దీనికి మంత్రి బొత్స స్పందిస్తూ తక్షణకే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడి మంజూరు చేయిస్తామని తెలిపారు. కొత్తవలస పిహెచ్‌సి స్టాఫ్ నర్స్ విధులకు గైర్హాజరైన విషయంపై సభలో చర్చ జరిగింది. విచారణ చేసి, ఆమెను సస్పెండ్ చేయాలని మంత్రి బొత్స ఆదేశించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.కోట ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ఉపాధ్యాయుల ధర్నాలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు

డిఎ, పిఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

కలెక్టరేట్ ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పిఎఫ్. ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవుల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్, రిటైర్డ్ ఉపాధ్యాయుల జిఐఎస్, సరెండర్ లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ తదితర ఆర్థిక సంబంధమైన బకాయిలు సుదీర్ఘ కాలంగా పేరుకు పోయాయని, వెంటనే చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు, రాష్ట్ర మహిళా విభాగం నాయకులు కె.విజయగౌరి, రాష్ట్ర నాయకులు డి.రాము, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, జె.రమేష్‌చంద్ర పట్నాయిక్ మాట్లాడారు. పిఆర్‌సి చర్చల సందర్భంగా మార్చి 2022 నాటికి అన్ని బకాయిలను చెల్లిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలో ఎలాంటి పురోగతీ లేదన్నారు. ఇప్పటివరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.1826 కోట్లు పైబడి పేరుకుపోయాయని అన్నారు. పిఎఫ్ బకాయిలు 8 నెలలుగా పెండింగ్‌లో ఉండగా మిగిలిన అన్ని రకాల బకాయిలు ఏడాదికి పైగా ఉన్నాయని తెలిపారు. వివాహాలు, ఆసుపత్రుల ఖర్చుల వంటి అత్యవసర సందర్భాలకు పిఎఫ్. ఎపిజిఎల్ఐ లోన్లు వంటి వాటికి దరఖాస్తు చేసుకొన్న వారికి సకాలంలో ఆ మొత్తాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన డిఎ ఎరియర్లకు ఇన్‌కం టాక్స్ చెల్లించినప్పటికి ఇప్పటివరకు వారికి ఖాతాలలో జమ కాలేదని చెప్పారు. సరెండర్ లీవులు, ఇతర ఆర్థిక పపరమైన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల పేరిట ప్రతీ నెలా ప్రజలకు వేలాది కోట్లు చెల్లిస్తున్న ప్రభుత్వం, ఉద్యోగులు కూడా ప్రజలలో భాగమే అన్న సంగతి మరచిపోయిందన్నారు. ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు. చెల్లించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. అనంతరం విద్యాశాఖ ఎడికు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో యుటిఎఫ్ ఉమ్మడి జిల్లాల నాయకులు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద మత్స్యకారులకు ద్విచక్ర వాహనాలను, ఐస్ బాక్సులను రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారయణ మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో పంపిణీ చేశారు. 2020-21, 2021-22కు సంబంధించి ఎంపిక చేసిన లబ్దిదారులకు ఈ ఉపకరణాలను పంపిణీ చేశారు. మొత్తం 31 మందికి ద్విచక్ర వాహనాలను అందజేశారు. సుమారు రూ.23,25,000 విలువైన 31 యూనిట్లకు గానూ, రూ.11,25,000ను ప్రభుత్వం సబ్సిడీగా విడుదల చేయగా, మిగిలిన రూ.12లక్షలను లబ్దిదారులు తమ వాటాగా చెల్లించారు. కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.నిర్మలాకుమారి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి సూచీల నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

అభివృద్ధి సూచీల నమోదుపై ఆరా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిల్లా అభివృద్ధిని తెలియజేసే సుస్థిర అభివృద్ధి సూచీలను (ఎస్‌డిజి) వాలంటీర్ యాప్‌లో ఏ విధంగా అప్ లోడ్ చేస్తున్నదీ కలెక్టర్ ఎ.సూర్య కుమారి ఆరాతీశారు. మంగళవారం ఎస్.కోట మండలం చిన్నకమిడిపల్లిలో కలెక్టర్ పర్యటించారు. ఎస్‌డిజి సూచీలను వాలంటీర్ యాప్‌లో నిర్దేశిత ఫార్మాట్‌లో ఎప్పటికప్పుడు అప్ లోడ్ చేయాలన్నారు. కలెక్టర్ వద్దకు వచ్చిన ప్రజలను సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ప్రశ్నించారు. అంగన్వాడీ బాలలతో, తల్లులతో కేంద్రంలో ఏం తింటున్నారు, రుచిగా ఉంటున్నాయా అని అడిగారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ సూర్యకళ, ఉప కలెక్టర్ సుదర్శనదొర, మండల అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం : సెర్ప్ సిఇఒ

- స్త్రీ నిధి, ముద్రా నిధులతో ఏర్పాటైన తయారీ యూనిట్లు ప్రారంభం
- పత్తి రైతులతో ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరం, బొండపల్లి, రామభద్రపురం

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని సెర్ప్ సిఇఒ ఎమ్‌డి ఇంతియాజ్ అన్నారు. మంగళవారం జిల్లాలో పర్యటించారు. పిఎంఇజిపి, స్త్రీ నిధి, ముద్రా తదితర నిధుల సాయంతో ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి యూనిట్లను ప్రారంభించారు. విజయనగరం, బొండపల్లి, రామభద్రపురం, రాజాం ప్రాంతాల్లో పలు స్వయం ఉపాధి యూనిట్ కేంద్రాలను సందర్శించి స్థితి గతులను తెలుసుకున్నారు. యూనిట్ నిర్వాహకులు, లబ్ధిదారులతో మాట్లాడారు. ముందుగా విజయనగరం పట్టణ పరిధిలోని సారిక గ్రామంలో పిఎంఇజిపి పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ఎంబ్రాయిడరీ యూనిట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. బొండపల్లి మండలం గొట్లాంలో శివ మహిళా సంఘం సభ్యులు వివిధ పథకాల ఆర్థిక సాయం రూ.8లక్షలతో ఏర్పాటు చేసిన జ్యూయలరీ బాక్సుల తయారీ, కుట్టు మిషన్ల, పేపర్ ప్లేట్ల తయారీ యూనిట్లను పరిశీలించారు.

సేంద్రియ విధానంలో పంటలు సాగు చేయాలి

పత్తి పంటతో పాటు ఇతర పంటలను కూడా సేంద్రియ పద్ధతిలో రైతులు రైతులు సాగు చేసుకోవాలని సెర్ప్ సిఇఒ సూచించారు. రామభద్రపురం మండలం మిర్తివలసలో గ్రామీణ వికాస కేంద్రం ఆధ్వర్యంలో పత్తి పండించే రైతులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ఇతర పంటలకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక సహకారాలను, గ్రామీణ వికాస కేంద్రం, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ ద్వారా అందిస్తాయని తెలిపారు. అనంతరం ఆయన రాజాంలో యూనిట్లను పరిశీలించి అక్కడ నుంచి నేరుగా శ్రీకాకుళం చేరుకున్నారు. కార్యక్రమాల్లో విజయనగరం, పార్వతీపురం డిఆర్‌డిఎ పీడీలు కల్యాణ్ చక్రవర్తి, కిరణ్ కుమార్, ఎపిడి సావిత్రి, ఎజిఎం ఉమా మహేశ్వరరావు, డిపిఎంలు జయశ్రీ, రవి, సెర్ప్ చేయూత విభాగం ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసరెడ్డి, స్థానిక ఏరియా కోఆర్డినేటర్లు బంగారమ్మ, విజయలక్ష్మి, ఎపిఎలు, సిసిలు పాల్గొన్నారు. రామభద్రపురంలో జరిగిన కార్యక్రమంలో జివికె సంస్థ ప్రతినిధులు, తహశీల్దార్ పత్రి గణపతిరావు, ఎంపిడిఒ కె.రమామణి, స్త్రీనిధి ఎజిఎం ఉమామహేశ్వరరావు, ఎంపిటిసి సభ్యురాలు బెవర సునీత, తదితరులు పాల్గొన్నారు. బొండపల్లిలో తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపిడిఒ వేధావతి, ఎపిఎం సులోచన దేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తులను పరిశీలిస్తున్న సెర్ప్ సిఇఒ ఇంతియాజ్

మేకను చంపేసిన పులి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని పొట్టిగదబవలస సమీపాన జంతికొండ ఫారెస్ట్ సెక్షన్ పరిధిలోని పెద్దపులి సంచారం ప్రజలను భయాందోళనలకు గురి చేస్తోంది. సోమవారం సాయంత్రం బుచ్చింపేటకు చెందిన బలసు శంకరరావు మేకలను ఓ తోటలోని మేపుతుండగా పులి దాడి చేసింది. ఇందులో ఒక మేకను చంపేసింది. అయితే దూరంగా ఉన్న కాపరి దీన్ని గమనించకుండా మేకలు చల్లాచెదురు కావడంతో వాటిని తోలుకొని ఇంటికి వెళ్ళాడు. అనంతరం మేకల మందలో ఒక మేక లేకపోవడంతో వెతికాడు. మంగళవారం ఉదయం డోపసీల సమీపంలో మేకను పులి తినేసి విడిచిపెట్టిన కళేభారాన్ని గుర్తించాడు. దీంతో ఫారెస్ట్ సెక్షన్ అధికారి నారాయణరావుకు సమాచారం ఇవ్వడంతో పులి దాడి చేసినట్లు గుర్తించారు. పులి పాదముద్రల గుర్తించి జంతికొండ వైపు పులి కదలికలు ఉన్నట్లు అంచనా వేశారు. దీంతో స్థానిక ప్రజలను అప్రమత్తం చేశారు.

పార్వతీపురంలో ప్రవేశించిన పులి

పార్వతీపురంరూరల్ : గత కొద్దిరోజులుగా విజయనగరం జిల్లాలో సంచరిస్తున్న పులి, ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాలోకి ప్రవేశించింది. ఏనుగులతో సతమతమౌతున్న ప్రజలకు ఇప్పుడు పులి కూడా తోడవ్వడంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. డోకిశీల పంచాయతీ జంతికొండ అంచునే ఉంటున్న బుచ్చింపేటకు చెందిన బలసు శంకరరావుకు చెందిన మేకను పులి చంపేసింది. సచివాలయ సిబ్బంది సమాచారంతో మక్కువ అటవీశాఖ అధికారులు వచ్చి పులి అడుగుజాడలను నిర్ధారణ చేసుకున్నారు.

మాంగనీస్ ఓర్ తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ

జనసేన, వైసిపి నాయకుల తోపులాట

ప్రజాశక్తి-గరివిడి

మండలంలోని దువ్వాం గ్రామ సమీపంలో మహాలక్ష్మి మినరల్స్ కంపెనీ ఆధ్వర్యంలో మాంగనీస్ ఓర్ తవ్వకాలపై డిఆర్‌ఒ గణపతిరావు ఆధ్వర్యాన మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. దువ్వాం, కోడూరు, దేవాడ గ్రామాల ప్రజలు హాజరయ్యారు. తవ్వకాలు చేపట్టే ప్రాంతం దువ్వాం గ్రామానికి సమీపంలో ఉండడంతో ఆయా గ్రామ ప్రజలంతా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇక్కడ ఇప్పటికే పలు పరిశ్రమలు ఉండడం వలన దుమ్మి ధూళితో పాటు వాతావరణ కాలుష్యం ఏర్పడి, చాలామంది ప్రజలు అనారోగ్య సమస్యలు బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన యాజమాన్యం వారు ఇబ్బందులకు లేకుండా రోడ్లకు ఇరువైపులా గ్రీన్ మేషను ఏర్పాటు చేస్తామని, చెట్లను దగ్గరగా పెంచుతామని, గ్రామానికి అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపింది. అంతకుముందు జనసేన పార్టీ నాయకులు జమ్ము ఆదినారాయణ మైనింగ్ సమస్యపై మాట్లాడుతూ, వాటి వలన కలిగే ఇబ్బందులను, అవసరాలను కూడా ఆ సమావేశంలో ప్రస్తావించారు. వైసిపి పథకాలను విమర్శించడంతో అక్కడ ఉన్న వైసిపి నాయకులంతా ఒక్కసారిగా ఆయన మీదకు దూసుకు వెళ్లారు. ఒకరినొకరు తోసుకోవడంతో పోలీసులు వారించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి సుదర్శన్, తహశీల్దార్ తాడ్డి గోవిందు, గరివిడి మండల జెడ్‌పిటిసి సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, మీసాల విశ్వేశ్వరరావు, మహాలక్ష్మి కంపెనీ ప్రతినిధి భరత్ రెడ్డి, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

వైసిపి,జనసేన నాయకుల మధ్య వాగ్వివాదం

భూములు లాక్కునేందుకు జిమ్మిక్కులు..!

- అన్నదాతకు అడుగడుగునా మోసం
- మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని రైతుల డిమాండ్
- కన్వర్షన్ పేరిట రైతాంగాన్ని ఏమార్చిన అధికారులు

ప్రజాశక్తి - జామి

అన్నదాత భూములను లాక్కునేందుకు సర్కారు జిమ్మిక్కులు చేస్తోంది. ప్రాజెక్టుల పేరిట చిన్నా, సన్నకారు రైతుల భూములు కారు చౌకగా లాగేసుకొని, కార్పొరేట్ సంస్థల వ్యాపార విస్తరణకు రెడ్ కార్పెట్ పరుస్తోంది. తాతల తండ్రుల నుంచి సాగు చేసి ధాన్యం పండించే రైతు నోటికాడ కూడును లాగేస్తోంది. ఇటీవల జామి రైల్వే కారిడార్ వివాదంలో రైతులకు జరుగుతున్న అన్యాయం అచ్చం అలాంటిదే.

జామి మండల కేంద్రంలోని రైతుల పరిస్థితి 'ముందు నుయ్యి...వెనుక గొయ్యి' అన్న చందంగా మారింది. ఇప్పటికే విశాఖ-రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి పేరిట వందల ఎకరాలు సేకరించిన ప్రభుత్వం, రైల్వే కారిడార్ పేరిట వేలాది ఎకరాలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే జామి రైతులు జిల్లా ప్రభుత్వ పెద్దలు మొదలు కొని, జిల్లా కలెక్టర్‌ను సైతం కలిసి గోడు వెళ్లబుచ్చుకున్నారు. కారిడార్ మట్టి నమూనాలు చేపడుతున్న సిబ్బందిని సైతం అడ్డుకుని, తమ భూములు ఇచ్చేది లేదని ఆందోళన చేశారు. కానీ రైతుల ఆందోళనలకు అణిచివేసేందుకు, పోలీసులను, రెవెన్యూ అధికారులను రంగంలోకి దించి, రైతులను భయ బ్రాంతులకు గురి చేశారు. దీంతో జిల్లా అధికారులను రైతులు పలుమార్లు ఆశ్రయించారు. భూములకు మార్కెట్ ధర రావాలంటే కన్వర్షన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. తీరా కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే చేయకపోవడంతో వారంతా తహశీల్దార్, ఆర్‌డిఒ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వాస్తవానికి ప్రభుత్వం ప్రాజెక్టుల పేరిట చేపడుతున్న భూసేకరణలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతి రెండేళ్లకు మార్కెట్ ధరకు అనుకూలంగా ప్రభుత్వం ధరను నిర్ణయించాల్సి ఉంది. కానీ భూ సేకరణ విషయంలో నామినల్ ప్రభుత్వ ధరతో కారు చౌకగా భూములు తీసుకొని రైతులను రోడ్డున పడేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే చట్ట పరిధిలో భూములకు మెరుగైన నష్ట పరిహారం ఇచ్చి, రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘాలు పోరాడుతున్నాయి. కానీ ప్రభుత్వాలు ఆ ఉద్యమాలను అణిచివేసే చర్యలతో రైతుల గొంతు నొక్కుతున్నాయి.

జామి గ్రామానికి సంబంధించి ఇప్పటికే గ్రీన్‌ఫీల్డు హైవే భూసేకరణతో చాలా మంది రైతులు భూములను పోగొట్టుకున్నారు. 460 సర్వే నెంబర్లలో ఉన్న రైతాంగానికి పూర్తి స్థాయిలో నష్ట పరిహారం అందించలేలేదు. తాజాగా రైల్వే కారిడార్ పేరుతో రెండు పంటలు పండే విలువైన భూములు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

కన్వర్షన్ కోసం దరఖాస్తులు

రైతులు కన్వర్షన్ చేసుకుని భూములు విలువ పెంచుకుంటే మెరుగైన పరిహారం వస్తుందని, లేదంటే ప్రభుత్వం విలువైన భూములను వదిలి, వేరే ప్రాంతం గుండా, కారిడార్ మారుస్తుందని అధికారులు సూచించడంతో సుమారు 50 మంది రైతులు కన్వర్షన్ కోసం దరఖాస్తులు పెట్టారు. ఇప్పటికే అందుకు సంబంధించిన డిడిలు కూడా తీశారు. కానీ ఇంతవరకు ఏ ఒక్కరికీ కన్వర్షన్ కాలేదు. అయితే ఇంతవరకు కన్వర్షన్ కోసం 9 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని తహశీల్దార్ హేమంత్‌కుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రైతులకు న్యాయం చేయాలి

ఇప్పటికే జామి రైతులు గ్రీన్‌ఫీల్డు హైవే భూసేరణతో రోడ్డున పడ్డారు. కారిడార్ వస్తే, స్వచ్ఛమైన వ్యవసాయ భూములు కోల్పోయే ప్రమాదం ఉంది. కన్వర్షన్ కోసం డిడిలు తీసి దరఖాస్తు చేసినా నేటికీ కాలేదు. రైతులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి.

- బర్ల వెంకటరమణ, రైతు, జామి గ్రామం.

కన్వర్షన్ త్వరితగతిన పూర్తి చేయండి

కారిడార్‌తో మూడు పంటలు పండే భూములు వదులు కోవాల్సిందే. ప్రభుత్వ పెద్దలు, అధికారులు రైతులకు న్యాయం చేసే చర్యలు తీసుకోవాలి. ప్రాజెక్ట్ నోటిఫికేషన్ వస్తే కన్వర్షన్ చేసే అవకాశం ఉండదు. కాబట్టి ఈ లోపే రైతుల దరఖాస్తులు పరిశీలించి న్యాయం చేయాలి. కె. వెంకటరావు, జామి, దొండపర్తి

ప్రజాశక్తి
www.prajasakti.com

వైస్ ఎంపిపికి ఎమ్‌పి పరామర్శ

అచ్చెంనాయుడును పరామర్శిస్తున్న ఎంపి చంద్రశేఖర్

రేగిడి : మండలం చిన్న శిర్లాం గ్రామానికి చెందిన ఎంపిటిసి, మండల వైస్ ఎంపిపి టంకాల అచ్చెం నాయుడు గుండెకు సంబంధించి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల రాగోలు జేమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేసుకున్న విషయాన్ని తెలుసుకున్న ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మంగళవారం పరామర్శించారు. గుండెకి సంబంధించి అనారోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు వైస్ ఎంపిపి వావిలపల్లి జగన్మోహన్‌రావు, రాజాం టౌన్ వైసిపి కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ ఉమా పాపి నాయుడు, వైసిపి నాయకులు కెంబూరు వెంకటేశ్వరరావు, చుక్క వెంకటి నాయుడు, కే శ్రీనివాసరావు ఉన్నారు

అభివృద్ధి పనులపై గ్రామ సభ

నెల్లిమర్ల :మండలంలోని బూరాడ పేటలో అభివృద్ధి పనులపై గ్రామ సభను మంగళ వారం పంచాయతీ కార్యదర్శి కర్రోతు భాస్కర రావు ఆధ్వర్యంలో జరిగింది. తుమ్మల పేట పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడి నాయుడు, వైసిపి నాయకులు బెల్లాన రామారావు సమక్షంలో అభివృద్ధి పనులపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పనులు గుర్తించి ప్రతిపాదనలు తయారు చేసి గ్రామ సభలో ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టిఎ గౌరి, ఫీల్డ్ అసిస్టెంట్ కె.ఆది లక్ష్మీ, గ్రామ పెద్దలు కోట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన బేబినాయన

క్షతగాత్రులతో మాట్లాడుతున్న బేబినాయన

బొబ్బిలి : గుప్తేశ్వరం వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి మహారాజ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన పరామర్శించారు. రామభద్రపురం మండలం మిర్తివలస గ్రామానికి చెందిన కొంతమంది గుప్తేశ్వరం వెళ్లి తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులను విజయనగరం మహారాజ ఆసుపత్రికి చేర్పించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న వారిని బేబినాయన పరామర్శించి ఓదార్చారు. వైద్యులతో మాట్లాడి నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. ఆయనతో రామభద్రపురం మండల నాయకులు ఎం.తిరుపతినాయుడు, సిహెచ్ రామకృష్ణ ఉన్నారు.

వికలాంగ పింఛన్ల పరిశీలన

వేపాడ : మండలంలో వికలాంగ పింఛను పొందుతున్న 18 గ్రామ సచివాలయాల పరిధిలోని లబ్ధిదారుల జాబితాను వెరిఫికేషన్ చేస్తున్నారు. ఇందులో భాగంగా పింఛనర్ల ముఖ చిత్రం అప్లోడ్ చేస్తున్నారు. ఈ పరిశీలనలో ఆయా గ్రామ సచివాలయాలలో ఉన్న వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు వికలాంగుల ఇంటి వద్దకు వెళ్లి నిర్ధారణ చేస్తున్నారు. సోంపురంలో జరిగిన వెరిఫికేషన్‌ను ఎంపిడిఒ బిఎస్ఎన్‌కె పట్నాయక్, పంచాయతీ కార్యదర్శి బి. నాగమణి, వెల్ఫేర్ అసిస్టెంట్ పరిశీలించారు.

హెచ్చరిక బోర్డు ఏదీ..?

ఈ స్థలంలో ఉన్న బోర్డే మాయమైంది..

వేపాడ : మండలంలోని వీలుపర్తి పంచాయతీ పరిధిలో గల పెదదుంగాడ రెవెన్యూ పరిధి సర్వే నెంబరు 12లో గల ప్రభుత్వ భూముల్లో ఇటీవల ప్రభుత్వ హెచ్చరిక బోర్డును అధికారులు ఏర్పాటు చేశారు. ఈ భూమును ఎవరు ఆక్రమించినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆ బోర్డులో పొందిపరిచారు. తహశీల్దార్ కృష్ణంరాజు ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆ బోర్డు అక్కడ కనిపించడం లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారులే ఆ బోర్డును తొలగించి ఉంటారని రైతులు ఆరోపిస్తున్నారు.

చెత్త నుండి సంపద కేంద్రం పరిశీలన

డెంకాడ : మండలంలోని డి.తాళ్లవలస, ఆకులపేట పంచాయతీ పరిధిలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం ఎంపిడిఒ డిడి స్వరూపారాణి పరిశీలించారు. ఈ కేంద్రాలను క్షున్నంగా పరిశీలించి, కేంద్రాల్లో పరిశుభ్రత పూర్తి స్థాయిలో లేనందున కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో తడిపొడి చెత్తలను పూర్తి స్థాయిలో వేరు చేసి చెత్త నుంచి సంపద ఎక్కువ వచ్చేటట్టు చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆకులపేట సర్పంచ్ సువ్వాడ రమేష్, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

రక్త నిల్వ కేంద్రం తనిఖీ

చీపురపల్లి : మండల కేంద్రంలో నిర్మాణం జరుగుతున్న రక్త నిల్వ కేంద్రాన్ని వైసిపి మండల పార్టీ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరబిందో పార్మా ఫౌండేషన్ చొరవతో రూ.60 లక్షలతో పనులను ప్రారంభించామన్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారికి రక్తనిధి నిల్వల కేంద్రం భవనాన్ని నిర్మించడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక ఎంపిటిసి రామదాసు, నాయకులు రేవళ్ళ సత్తిబాబు, ప్రభాత్ కుమార్, సుంకరి చంద్రశేఖర్ గుప్తా, మొండేటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న శ్రీచైతన్య విద్యార్థులు, సిబ్బంది

శ్రీచైతన్య విద్యార్థుల ర్యాలీ

విజయనగరం : రహదారి భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నగరంలోని రింగ్‌రోడులోగల శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షకులు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతినెలా నిర్వహించే స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అంతకుముందు 'రహదారి భద్రతా– ఆవశ్యకత'పై విద్యార్థులకు ఎఎస్ఐ వివరించారు. ప్రయాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ట్రాఫిక్ నియమాలను వివరించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు, డీన్లు సాయి సాయి కిశోర్, సత్యనారాయణ, అప్పలనాయుడు, వైస్ ప్రిన్సిపాల్ జగదీష్ పాల్గొన్నారు.

తాళం తెరవరా..?

తాళం వేసి ఉన్న కార్యాలయం

వేపాడ : మండల కేంద్రంలో ఉన్న మండల వ్యవసాయ కేంద్రం ఎప్పుడు తెరుస్తారో తెలియని పరిస్థితి కనిపిస్తోంది. నిత్యం ఈ కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎఒ ఎప్పుడు వస్తారో ఎవరికీ తెలీయని పరిస్థితి. గ్రామ సచివాలయాలలో పరిష్కారం కానీ సమస్యలను మండల వ్యవసాయ అధికారి యశ్వంత్ కుమార్ తెలియజేసేందుకు రైతులు వస్తున్నా కార్యాలయానికి ఎప్పుడూ తాళం వేసి ఉండటంతో వెనుదిరుగుతున్నారు. వ్యవసాయాధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ వారి సందేహాలను నివృత్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ దానికి విరుద్ధంగా మండల కేంద్రంలో గల వ్యవసాయ శాఖ కార్యాలయం ఎప్పుడూ మూతబడే ఉండటం గమనార్హం. ఈ విషయంపై మండల వ్యవసాయాధికారి యశ్వంత్ కుమార్‌ని ఫోన్‌లో సంప్రదించగా స్విచ్‌ఆఫ్ వస్తుంది.

ప్రభుత్వ విధానాలతో విద్యారంగం నాశనం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కొత్తవలస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో ప్రభుత్వ విద్యారంగం నాశనం అవుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామ్మోహనరావు అన్నారు. మంగళవారం స్థానిక ప్రగతి కళాశాలలో ఎస్ఎఫ్ఐ మండల మహా సభ నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మహా సభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఈ దేశాన్ని హిందూ దేశంగా మార్చాలనే అజెండాలో భాగంగానే నేడు పాఠ్యపుస్తకాల్లో మతం పేరిట పాటలు ప్రచురణ చేస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే నూతన జాతీయ విద్యావిధానాన్ని తీసుకొచ్చి ప్రైవేట్ విద్యా సంస్థల స్థాయిని పెంచుతున్నారని అన్నారు. బిజెపి

కొత్తవలస: ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ప్రభుత్వ తొత్తుగా పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వం, రాష్ట్రంలో ప్రభుత్వ స్కూల్స్‌లో బోధనా సిబ్బంది కోత విధిస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న సంక్షేమ హాస్టల్స్‌కు సొంత బిల్డింగ్, మెనూ చార్జీ పెంపు, కాస్మోటిక్ చార్జీలు విడుదల చెయ్యమంటే కాలం గడుపుతుందని అన్నారు. విద్యార్థులకు రావాల్సిన అమ్మఒడి, విద్యాదీవెనల్లో కోతలు విధిస్తున్నారని వసతిగృహాలు, కళాశాలల్లో సౌకర్యాలు కల్పించడంలో కూడా ఈ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. అనంతరం కొత్తవలస నూతన మండల కమిటీ 15 మందితో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా గణేష్, నాయుడు, మండల ఉపాధ్యక్షులుగా శ్రావణ్, గర్ల్స్ కన్వీనర్‌గా మహేశ్వరిను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష పాల్గొన్నారు.

నెల్లిమర్లలో విద్యార్థుల భారీ ర్యాలీ

నెల్లిమర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా నాశనం చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డి రాము విమర్శించారు. గురువారం ఎస్ఎఫ్ఐ నెల్లిమర్ల మండల మహాసభ సందర్భంగా విద్యార్థులతో రామతీర్థం జంక్షన్ నుంచి మొయిద జంక్షన్ వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొయిద జంక్షన్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాము మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం విద్యార్థులకు నష్టం చేసే విధంగా ఉందని, విద్యార్థుల్లో కులమత భావ జాలాలను రేకెత్తిస్తుందని దీనిని వెంటనే రద్దు చేయాలని కోరారు. బకాయి ఉన్న అమ్మఒడి, జగనన్న విద్యా

నెల్లిమర్ల: సభలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దీవెన, వసతి దీవెన నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. సంక్షేమ హాస్టల్స్ పరిస్థితి చూస్తే దిక్కు తెలియని అనాధల పడి ఉందని, సంక్షేమ హాస్టల్ నిర్వీర్యం చేసే కుట్ర ఈ రాష్ట్ర ప్రభుత్వం పన్నుతుందని, కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సౌమ్య మాట్లాడుతూ దేశంలో స్త్రీలకు రక్షణ కరువైందన్నారు. స్త్రీలకు ఏర్పాటు చేసిన చట్టాలు కాగితాలకే పరిమితి అవడం కాకుండా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 18 మందితో నూతన మండల కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా హేమంత్, బాలాజీలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జె.రవికుమార్, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ అరవింద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు

రహదారి పనుల్లో నాణ్యతేదీ?

ప్రజాశక్తి- రేగిడి

- అధికారుల పర్యవేక్షణా లోపం
- మరమ్మతు పనుల్లో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం

రాజాం– పాలకొండ ప్రధాన రహదారి మరమ్మత్తు పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్ అండ్ బి అధికారుల పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణమని తెలిస్తోంది. ఇటీవల ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ప్రధాన రహదారి శిథిలమైన విషయం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వినతి ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో మరమ్మతుల కోసం రూ.70 లక్షలు మంజూరు చేశారు. అయితే రహదారి పూర్తిగా శిథిలమైనప్పటికీ కాంట్రాక్టర్ మాత్రం మరమ్మతు పనులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి సరైన పద్ధతిలో చేపట్టకపోవడంతో పాదాచారులు, వాహనదారులు, ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. చాలా చోట్ల గుంతలు పూడ్చకుండా ఎక్కడబడితే అక్కడే గుంతలు ఉంచి, సరైన పద్ధతిలో మరమ్మతులు చేపట్టకపోవడం ఎంతవరకు సమంజసమని పలువురు పెదవివిరుస్తున్నారు. ఈ మరమ్మత్తు పనులు నాణ్యత లేకపోవడంతో మూడు నాళ్ళ ముచ్చటేనని విమర్శిస్తున్నారు.

అధికారులు లేకుండానే పనులు

ఆర్అండ్‌బి అధికారులు లేకుండా ప్రధాన రహదారి పనులు చేయడం పట్ల ఆంతర్యం ఏమిటి అర్థం కావడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు కాంట్రాక్టర్ జేబులు నింపడం వల్లే పనుల్లో నాణ్యత లేదని ఆరోపిస్తున్నారు. ఇంత దారుణంగా నాణ్యతలేని ప్రధాన రహదారి మరమ్మతు నిర్మాణ పనులు ఎక్కడా చూడలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ల క్రితం పూర్తిగా శిథిలమైన ప్రధాన రహదారికి ఏడాదిన్నర క్రితం రూ.90 లక్షలతో మరమ్మత్తు పనులు

తూతూ మంత్రంగా మరమ్మతులు చేసిన రహదారి

చేపట్టినప్పటికీ నాణ్యత ప్రమాణాలు లేకపోవడంతో పూర్తిగా శిథిలమైంది. అదే రోడ్డుకు ప్రస్తుతం మరో రూ. 70 లక్షలు మంజూరు చేసి మళ్లీ నాణ్యత లేని పనులు చేస్తున్నారని పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతుంది. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి ప్రధాన రహదారి మరమ్మత్తు పనులు పర్యవేక్షణ జరిపి పూర్తిస్థాయిలో రోడ్డు మరమ్మత్తు పనులు జరిపి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా?

ప్రజాశక్తి - నెల్లిమర్ల


నదీ పరివాహక ప్రాంతంలో నిల్వ ఉన్న ఇసుక

మండలంలో యధేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. ముఖ్యంగా చంపావతి నది పరివాహక ప్రాంతంలో మొయిద కాజ్‌వే సమీపంలో ఇసుక తవ్వకాలు జరిపి రైలు పట్టాల వద్ద డంప్ చేసి రాత్రుళ్ళు లారీల ద్వారా తరలిస్తున్నారు. అలాగే జ్యూట్‌మిల్ బ్రిడ్జి కింద నీటి పథకాల వద్ద కూడా మిని ఆటోలు, ఎడ్ల బళ్ళు ద్వారా ఇష్టానుసారంగా రవాణా జరుగుతున్నా అధికార యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరిస్తుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. పగటి పూట బండ్లు, ఆటోల ద్వారా ఇసుకను సమీప తోటలు, నిర్మానుష్య ప్రాంతాల్లో నిల్వ చేసి రాత్రి వేళల్లో లారీల ద్వారా అమ్మకాలు జరిపి అక్రమార్కులు వేలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. సదరు ఇసుక అక్రమార్కులు ప్రభుత్వ యంత్రాంగానికి నెల వారీ మామ్ములు ఇస్తున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి. అందువల్లే ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకొని మంచి నీటి పథకాలను పరిరక్షించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సిఎం కప్ టోర్నమెంటు ప్రారంభం

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస ప్రగతి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో ఎపి సిఎం కప్ ప్రైజ్ మనీ టోర్నమెంట్ 2022 నియోజకవర్గ ఎంపికలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో ప్రతి విద్యార్థి రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ప్రతి క్రీడాకారుడూ తమ ప్రతిభను కనబరచి ఉన్నత స్థానాన్ని పొందాలని ఆకాంక్షించారు. వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ ఎంపిక పోటీలకు వచ్చిన విద్యార్థులను అభినందించారు. ఈ ఎంపిక పోటీలకు నియోజకవర్గానికి చెందిన సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28, 29 తేదీలలో జరిగే జిల్లా టీమ్ సెలక్షన్‌లలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస ఎంపిపి ఎన్. గోపమ్మ, ప్రగతి విద్యా సంస్థల అధినేత వి. శ్రీనివాసరావు, నియోజకవర్గ స్పోర్ట్స్ ఇంచార్జి, విజయనగరం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు కె. కృష్ణంరాజు, జిల్లా క్రీడాధికారి పి. అప్పల నాయుడు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పోస్టల్ శ్రీను, ఎస్‌జియఫ్. జిల్లా కార్యదర్శి ఎల్.వి. రమణ, వాలీబాల్ నేషనల్ రిఫరి ఎల్‌జిఎన్. కుమార్, పీడీలు జి. లక్ష్మణరావు, జి. రవికుమార్, బి. చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి : జగనన్న క్రీడా బ్రోచర్‌ను గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య మంగళవారం విజయనగరంలోని తన స్వగృహంలో విడుదల చేశారు. జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా నియోజకవర్గ స్థాయి కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ క్రీడల్లో ఈ నెల 25న శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు బొండపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతాయని జిల్లా క్రీడాధికారి ఎస్. అప్పలనాయుడు చెప్పారు. 17 సంవత్సరాలు దాటిన బాలబాలికలు ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, క్రికెట్ కిట్లతో బొండపల్లి హై స్కూల్లో హాజరు కావాలని కోరారు.

'థర్డ్ ఐ'తో సెంచూరియన్ ఎంఒయు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

న్యూ ఢిల్లీకి చెందిన థర్డ్ ఐ టెక్నో సొల్యూషన్స్‌తో సెంచూరియన్ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయం విసి జిఎస్ఎన్ రాజు, థర్డ్ ఐ టెక్నో సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ నీరజ్ కుమార్ మధ్య వర్చువల్ విధానంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఈ ఒప్పందం వల్ల బిఎస్‌సి ఫోరెన్సిక్ విద్యార్థులకు ప్రాజెక్టు వర్కు, ఇంటర్న్‌షిప్, పరిశోధన, ఉపాధి అవకాశాలు పొందడానికి దోహదపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, పారా మెడికల్ డీన్ డాక్టర్

విసి ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు

వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

ఎం.లక్ష్మీనరసింహా చార్యులు, డీన్ కృష్ణమూర్తి, విలాస్ చవాన్, విభాగాధిపతి ప్రవల్లిక, భువనేశ్వర్ క్యాంపస్ విభాగాధిపతి డాక్టర్ నాగ, థర్డ్ ఐ ప్రతినిధులు పి.కుమార్, యు.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతు పనులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వావిలిపాడు జంక్షన్ నుండి కృష్ణ రాయుడుపేట వరకు గల ప్రధాన రహదారి మరమ్మతులకు గురికావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో 'ప్రయాణికులు బాధలు పట్టవా' అను శీర్షికన కథనం వెలువడింది. దీనికి స్పందించిన అధికారులు మంగళవారం మరమ్మతు చేపట్టారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ప్రస్తుతం వేస్తున్న రోడ్డు నాణ్యత లోపం లేకుండా వేయాలని కోరుతున్నారు. ఈ రోడ్డు గుండా విశాఖ నుండి కొత్తవలస మీదుగా దేవరాపల్లి, అనకాపల్లి, వెళ్లే ఆర్టీసీ బస్సులతో పాటు వందలాది క్వారీ లారీలు, మినీ వాహనాలు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ప్రయాణించడం వల్ల రద్దీగా ఉంటుంది. గత మూడు సంవత్సరాలుగా ఈ రోడ్డు గుండా ప్రయాణించడం నరకయాతనగా ఉన్న నేపథ్యంలో రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించినందుకు వావిలిపాడు, నల్లబెల్లి, జమ్మాదేవిపేట, చిలగుడిపాల, ఎన్‌కేఆర్ పురం, బల్లంకి, బానాది, ఏకేజీ పాలెం, కెఆర్ పాలెంపల్లి గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తగా వేస్తున్న రహదారి

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతను మున్సిపల్ చైర్మెన్ సావు వెంకట మురళీ కృష్ణారావు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి మంగళ వారం పరిశీలించారు. బొబ్బిలి నుంచి బలిజిపేట రోడ్డు వైండింగ్ నిమిత్తం జరుగుతున్న కల్వర్ట్ పనులను పరిశీలించారు. అనంతరం నూతనంగా తాగునీటి పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో అభివృద్ధి పనులు ఊపందుకోవడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతోందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పలు రోడ్డు నిర్మాణాలు జగుతున్నాయని ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేస్తుందని చెప్పారు.

పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీ కృష్ణారావు

టిఎన్ఎస్ఎఫ్ పోరు బాట

వేపాడ: టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ' సంక్షేమ హాస్టల్ పోరుబాట' కార్యక్రమంలో భాగంగా ఎల్.కోట, కొండగంగుపూడి ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ వసతి గృహాలను టిఎన్ఎస్ఎఫ్ విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు రత్నాకాంత్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాలకు సంబంధించిన భవనాలు చాలా వరకూ శిథిలావస్థకు చేరాయన్నారు. ఇదేనా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమమని ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలావస్థకు చేరిన వసతి గృహాల్లో విద్యార్థులు ఉండటానికి భయపడుతున్నారని అన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉందని, కనీసం దీపాలు కూడా లేని స్థితి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 30 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలోను 'సంక్షేమ హాస్టల్ పోరు బాట' కొనసాగుతుందని అన్నారు. డిసెంబరు 5న అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.

రికార్డు ప్రకారం భూములను గుర్తించాలి

ప్రజాశక్తి- రేగిడి

గ్రామాలలో రికార్డులు ప్రకారం ప్రభుత్వ భూములు గుర్తించి పారదర్శకంగా నివేదికలు తయారు చేయాలని ఏడి సర్వేయర్ త్రివిక్రమరావు సూచించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 39 గ్రామ పంచాయతీలలో 54 రెవెన్యూ గ్రామాలలో 66 గ్రామాలకు సంబంధించి ప్రభుత్వ భూములు గుర్తించాలని సూచించారు. గ్రామాలలో ప్రభుత్వ రికార్డులు, మ్యాప్‌లు ఆధారంగా ఏ ఒక్క సెంటు వదలరాదని సూచించారు. బుధవారం నుంచి గ్రామాలు వారీగా రికార్డుల ఆధారంగా ప్రభుత్వ భూములు రికార్డ్ చేసి మార్కింగ్ చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం ఉప్పర నాయుడు వలస గ్రామంలో ప్రభుత్వం సరఫరా చేసిన సర్వే రాళ్లను రోవర్ పాయింట్స్ ప్రకారం పాతి పెట్టే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈయనతో పాటు తహశీల్దార్ టీ. కళ్యాణ చక్రవర్తి, మండల సర్వేయర్, చీపురుపల్లి డిఐఒఎస్, గ్రామ సర్పంచ్ ఉన్నారు.

సర్వే రాళ్లను పరిశీలిస్తున్న ఏడి సర్వేయర్

23 మద్యం సీసాలతో వ్యాపారి అరెస్టు

బొబ్బిలి : మండలంలోని అలజంగిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యాపారి బోనెల రవిను అరెస్టు చేసి 23 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ తెలిపారు. అలజంగిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి వ్యాపారి రవిను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అక్రమంగా మద్యం, నాటుసారా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడిలో ఎస్ఐ చిన్నంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుబడిన మద్యం సీసాలతో పోలీసులు

ఇసుక ట్రాక్టర్ సీజ్

బొబ్బిలి : అలజంగి వేగావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఇబి పోలీసులు సీజ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలించడంతో ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు అప్పగించామన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ హెచ్చరించారు.

118 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిధిలోని రొంపల్లి గ్రామంలో రామమందిరం వద్ద మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి సుమారు118 మందికి కంటి పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు చిక్కాల స్వాతీశ్రీ తెలిపారు. తిరుపతికి చెందిన నవజీవన్ ట్రస్ట్ శ్రీదరాచార్య ఆర్థిక సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలతో బాద పడుతున్న రోగుల కోసం ఉచిత వైద్య శిబిరాలు పుష్పగిరి కంటి ఆసుపత్రి, అంధత్వ నివారణ సంస్థ సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా చేయించడమే కాకుండా ఉచిత రవాణా, భోజన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారికి ఉచితంగా చికిత్స చేయిస్తామని అన్నారు. ఈ వైద్య శిబిరంలో 118 మంది పాల్గొనగా, 42మందిని ఆపరేషన్లకు గుర్తించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోశాధికారి చిక్కాల చిన్నమ్మలు(శాంతి), స్థానిక ఎంపిటిసి బవిరెడ్డి శంకరరావు, పుష్పగిరి కంటి ఆసుపత్రి సిబ్బంది సురేష్, లక్ష్మణరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

వంగర : పేదలందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కింజంగిలో మంగళవారం గడపగడపకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకొని ప్రభుత్వ అందిస్తున్న పథకాలు గూర్చి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలు అందించడం సాధ్యమని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ, తహశీల్దార్ డి. ఐజాక్, వైసిపి మండల కన్వీనర్ కరణం సుదర్శన్ రావు, బొంతు వెంకటరావు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే జోగులు

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి - వంగర

18 ఏళ్లునిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు చేర్పించుకోవాలని తహశీల్దార్ డి. ఐజాక్ అన్నారు. మండలంలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మీ కుటుంబాల్లో ఎవరైనా 18 ఏళ్లు నిండిన వారుంటే వారికి అవగాహన కల్పించి ఓటు నమోదు చేయించేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొరటాల నారాయణరావు, ఎంఇఒ వై దుర్గారావు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.